క్లుప్తంగా

నేడు లోవ పొన్నవోలులో 'గడప గడపకు'

మాడుగుల రూరల్: లోవ పొన్నవోలులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు పొన్నవోలు పంచాయతీ ఎల్.కె. గదబవీధిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ప్రారంభిస్తారని, పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు, పాల సొసైటీ అధ్యక్షులు, తదితరులు హాజరు కావాలని కోరారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



పరికరాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చీడికాడ: మండలంలోని తురువోలు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు తమ సొంత నిధులతో సామగ్రిని వితరణగా అందించారు. ఇక్కడ 2003–04 ఏడాదిలో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ. 50 వేలతో కొనుగోలు చేసిన ఇన్వర్టర్, ఉపాధ్యాయ సిబ్బందికి కుర్చీ లు, ఎలక్ట్రికల్ స్కూల్ బెల్‌ను పాఠశాలకు బహూకరించినట్లు హెచ్‌ఎం రామకృష్ణ తెలిపారు.

నీట్ విద్యార్థికి ఎంపీ అభినందన



ఎంపీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి, అతడి తల్లిదండ్రులు

దేవరాపల్లి: గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్ కుమారుడు ఉదయకుమార్‌ను అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి అభినందించారు. ఇటీవల నీట్‌లో ఉదయ్‌కుమార్ 610 మార్కులు సాధించాడు. కేంద్ర గౌరీ సంఘం ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఉదయ్‌కుమార్‌కు గౌరీ సంఘ నాయకులతోపాటు ఎంపీ ప్రశంసాపత్రం అందజేశారు. అతడి తల్లిదండ్రులను అభినందించారు.

నిరసనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు చిట్ల చలపతిరావు

నర్సీపట్నం: దళితల సమస్యలపై వచ్చే 14న తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక డివిజన్ అధ్యక్షుడు చిట్ల చలపతిరావు కోరారు. పట్టణంలో సంఘ నాయకులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దళిత వాడల అభివృద్ధికి వెచ్చించాలన్నారు. సమావేశంలో బుంగా మాణిక్యం, గాతాడ సహదేవుడు, నేత నాగేశ్వరరావు, చిట్ల చిన నూకరాజు, యాదిగిరి సత్తిబాబు, మరువాడ అర్జున్, పూడి అర్జున్ గంగరాజు, మంగరాజు పాల్గొన్నారు.

17 నుంచి శ్రావణమాస ఉత్సవాలు



ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్: సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో ఆగస్టు 17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాధరావు తెలిపారు. ఈ మేరకు కల్యాణగిరిపై ఆదివారం నిర్వహించిన సమావేశంలో శ్రావణ మాస ఉత్సవాలు, ప్రత్యేక పూజలకు సంబంధించి ఆహ్వాన శుభపత్రికను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 17న శ్రావణ శుద్ధ పాడ్యమి గురువారం ఉదయం 7 గంటలకు కోటి కుంకుమార్చన జరపాలని నిర్ణయించారు. సమావేశంలో ధర్మకర్త బోయిన రమణాజీ, లక్కరాజు అప్పారావు, కోశాధికారి పోతల రమణ, ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు, కోరుకొండ సాంబశివరావు, సుకురు చంద్రం, కరణం నాయుడు, మళ్ల భోగలింగం, బాదపు రామలక్ష్మి, శ్రీదేవి, కుమారి, వెంకటరావు, దాస అప్పారావు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

- విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజల ముంగిటకే వైద్యం
- కాలు కదపకుండానే రోగి చెంతకు డాక్టర్
- దీర్ఘకాలిక రోగులకు ఫ్యామిలీ డాక్టర్ భరోసా
- ప్రభుత్వ వైద్య సేవలపై సర్వత్రా ప్రశంసలు

'ఏ ఒక్కరికీ వైద్యం అందక బాధపడకూడదు. పేదరికం కారణంగా ఈ పరిస్థితి రాకూడదు. అందరూ ఆరోగ్యంగా ఉండాలి.' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు అంకురార్పణ చేశారు. ఈ నేపథ్యంలో రోగులు కాలు కదపకుండానే వైద్య సేవ లందుతున్నాయి. వారి ఇంటి వద్దకే డాక్టర్ వస్తున్నాడు. దీర్ఘకాలిక రోగులకు భరోసా ఇస్తున్నాడు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పుణ్యమా అని ఇదంతా సాధ్యమవుతుందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



మాకవరపాలెంలో బాలికను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీవిద్య



చోడవరం బెడ్ రెస్ట్ రోగికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ దమయంతీదేవి

నర్సీపట్నం/చోడవరం/మాడుగుల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ వైద్య సేవలు పేదలకు వరంగా మారాయి. నియోజకవర్గం పరిధిలోని నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. వీటితో గ్రామస్థాయిలోనే వైద్య సేవలు అందుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బంది షెడ్యూల్ ప్రకారం విలేజ్‌కు వెళ్లి వైద్య సేవలు అందించడాన్ని సాక్షి క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించింది. వైద్యులు ఉదయం 9 గంటలకే గ్రామాలకు చేరుకుని మధ్యాహ్నం 2 గంటల వరకు ఓపీ చూశారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి పరీక్షించి మందులు ఇచ్చారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో...

- నర్సీపట్నం మండలంలో ఒక పీహెచ్‌సీ ఉంది. వేములపూడి పీహెచ్‌సీ పరిధిలో నీలిగుంట గ్రామ విలేజ్ క్లినిక్‌లో శనివారం వైద్య సేవలందించారు. వేములపూడి పీహెచ్‌సీ డాక్టర్ అనూష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 52 ఓపీలు చూశారు. వీటిలో బీపీ రోగులు 38 మంది కాగా.. డయాబెటిస్ రోగులు 9 మంది ఉన్నారు.

అనంతరం 2 గంటల తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లో, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న ఇద్దరి రోగులను ఇంటికి వెళ్లి హెల్త్ చెకప్ చేశారు.

- నాతవరం మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. నాతవరం పీహెచ్‌సీ పరిధిలో ఎం.బెన్నవరం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పీహెచ్‌సీ డాక్టర్ ఎం. రాజేష్‌నాయుడు వైద్య సేవలందించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 72 ఓపీలు చూశారు. వీటిలో 32 మంది బీపీ రోగులు, 24 మంది డయాబెటిస్ రోగులు, 16 మంది ఇతర చిన్నపాటి రుగ్మతలకు వైద్య సేవలందించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను, దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న ముగ్గురు రోగుల ఇంటికి వెళ్లి పరీక్షించారు. గునిపూడి పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ లేకపోవడంతో హెల్త్ క్యాంప్ చేయలేదు.
- మాకవరపాలెం పీహెచ్‌సీ పరిధిలో నారాయణరాజుపేట విలేజ్ క్లినిక్ వైద్యురాలు శ్రీవిద్య 60 మందిని పరీక్షించి, 55 మందికి రక్త పరీక్షలు, బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలోని తూటిపాల విలేజ్ క్లినిక్‌లో డాక్టర్ చరణ్ 70 మందిని పరీక్షించి 47 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు.
- గొలుగొండ మండలం పీహెచ్‌సీ పరిధిలో పాత మల్లంపేట విలేజ్ క్లినిక్‌లో డాక్టర్ అశ్విని శైలజ 53 మందిని పరీక్షించి, 19 మందికి బ్లెడ్ టెస్టులు చేశారు.



చోడవరంలో ఓపీ రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

చోడవరం నియోజకవర్గంలో...

- చోడవరం మండలం గవరవరం పీహెచ్‌సీ పరిధిలో శనివారం గజపతినగరంలో వైద్యురాలు దమయంతీదేవి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 89 మందిని పరీక్షించారు. అవసరమైన వారికి మాత్రలు, సిరప్‌లు పంపిణీ చేశారు. ఇద్దరు బాలింతలు, 9 మంది గర్భిణులను పరీక్షించారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ముగ్గురు బెడ్ రెస్ట్ రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షించి తగు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు.
- బుచ్చియ్యపేట మండలంలోని బుచ్చియ్యపేట, తురకలపూడి, వడ్డాది పీహెచ్‌సీ పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్ విజిట్‌లు జరగలేదు. నాల్గో శనివారం కావడంతో ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించలేదు.
- రోలుగుంట పీహెచ్‌సీ పరిధి కె.నాయుడుపాలెంలో వైద్యాధికారి కల్లాడ వెంకట శ్రావణి శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ చూశారు. మధ్యాహ్నం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి బెడ్ రెస్ట్ పేషెంట్లు గుములూరి జగదీశ్వరి, మద్దు రాజుబుల్లి, గుములూరి నూకరాజుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందించారు. అనంతరం 2 నుంచి 4 గంటల వరకు పాఠశాలలో విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పరీక్షించారు.

మాడుగుల నియోజకవర్గంలో

- మాడుగుల మండలం తాటిపర్తి విలేజ్ క్లినిక్ పరిధిలో కృష్ణంపాలెంలో కె.జె.పురం పీహెచ్‌సీ డాక్టర్ ఎల్.శివప్రసాద్ 60 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 13 మంది బీపీ, 11 మంది సుగర్ వ్యాధిగ్రస్తులు, ముగ్గురు దీర్ఘకాలిక రోగులు ఉన్నారు.
- కె.కోటపాడు మండలం గుల్లేపల్లిలో ఫ్యామిలీ డాక్టరు వైద్య సేవలను నిర్వహించారు. గ్రామంలో 69 మందికి ఓపీ వైద్య సేవలందించారు. అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి 9 మందిని పరీక్షించారు. గర్భిణులను పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ పరిధిలో డి.అగ్రహారంలో డాక్టర్ పి.సాయికిరణ్ 58 మంది రోగులను పరీక్షించారు.
- దేవరాపల్లి మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. దేవరాపల్లి పీహెచ్‌సీ పరిధిలో కాశీపురం విలేజ్ క్లినిక్‌లో డాక్టర్ మేఘన పాల్గొని 41 మందికి ఓపీ సేవలందించారు. వేచలం పీహెచ్‌సీ పరిధిలో వెంకటరాజుపురంలో డాక్టర్ గోవిందరెడ్డి పాల్గొని వైద్య సేవలందించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వంద ఓపీలు వచ్చాయి. ఇందులో బీపీ, సుగర్ రోగులు 60 వరకు ఉన్నారు. 30 మంది గర్భిణులు, 10 మంది రక్తహీనత, మిగతా వారు జ్వరం, ఇతర రుగ్మతలువారు ఉన్నారు.



రోలుగుంట మండలం కె.నాయుడుపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణి

వైద్యులు ఇంటి వద్దకే వస్తున్నారు..



గతంలో వైద్యానికి ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. తాను పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాను. నెలకు రెండు సార్లు వైద్యులు మా ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు ఇస్తున్నారు. ఈ కార్యక్రమం రాకముందు తనను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడేవారు. ఆ ఇబ్బందులు తొలగి ఇంటి వద్దే వైద్య సేవలు అందుతున్నాయి.

కామిరెడ్డి ఎర్రయ్యమ్మ,
మాకవరపాలెం మండలం

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్థానికులు 101 ఘటాలతో ఇంటి పండగ నిర్వహించారు. దూర ప్రాంతాలతోపాటు మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

అనకాపల్లిటౌన్: వినియోగదారుల హక్కులు, పౌర సరఫరాలు, వ్యవసాయశాఖల సమస్యల పరిష్కారానికి ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 1967ను సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ సూచించారు. గవరపాలెంలోని పబ్లిక్ ఫోరం కార్యాలయంలో ఆదివారం జరిగిన వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, బియ్యం కార్డు, గ్యాస్, పెట్రోల్ బంకులు, రైతు బజార్లు, తూనికలు కొలతల శాఖ, ఔషధ నియంత్రణ, హాల్‌మార్కు, ఐఎస్‌ఐ మొదలగు వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ దిక్సూచిగా నిలుస్తుందన్నారు. వినియోగదారుల హక్కుల రక్షణ, చైతన్యం తీసుకురావడం ప్రధాన లక్ష్యాలుగా ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ రాష్ట్ర ప్రభుత్వం నెలకొలిప్పిందన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, వినియోగదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.రమణ, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఎస్.నూకరాజు, బి.జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

గడప వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 13వ వార్డులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయనకు వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, పార్టీ నాయకులు వార్డు వాసులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేరిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. స్థానిక అవసరాలను గుర్తించి అందించడంతోపాటు వివిధ రకాల పౌరసేవలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని దీవించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీ షాబేగం, కర్రి శ్రీనివాసరావు, అర్జున్, కౌన్సిల్ వీర మాచినేని జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, ఎండీ బాషా, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు, టౌన్ యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ నాయకులు యాదిగిరి శేషు, కణితి అన్నపూర్ణ, గంటా లలిత, వరలక్ష్మి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి 84 ఆధ్యాత్మిక పుస్తకాల వితరణ



ఆధ్యాత్మిక పుస్తకాలను అందిస్తున్న నేమాని వెంకటేశ్వరశర్మ

కె.కోటపాడు: ప్రజలు ఆధ్యాత్మిక పుస్తక పఠనం అలవర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. పాచిలవానిపాలెం రామాలయంలో గ్రంథాలయానికి ఆర్.వై.అగ్రహారానికి చెందిన రిటైర్డ్ షిప్‌యార్డ్ ఉద్యోగి నేమాని వెంకటేశ్వర శర్మ తన సొంత నిధులతో 84 ఆధ్యాత్మిక పుస్తకాలను సమకూర్చారు. వీటిని దాట్ల శివాజీ రాజు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయిప్రసాద్, వార్డు మెంబర్ చల్లా సురేష్, గండి సత్యనారాయణ సమక్షంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా దాత వెంకటేశ్వర శర్మ మాట్లాడుతు ఆధ్యాత్మిక పుస్తక పఠనంతో యువత సన్మార్గంలో పయనిస్తుందన్నారు. రామాయణం, మహాభారతం, చైతన్య రామాయణంతోపాటు ప్రముఖ ఆలయాల విశిష్టతలను తెలిపే పుస్తకాలను అందించినట్లు పేర్కొన్నారు. నేమానితోపాటు అతని భార్య కాశీబాయిని గ్రామస్తులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

గడ్డి లోడు ట్రాక్టర్లతో ఇక్కట్లు



కొత్తకోట నుంచి నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో భారీ గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టరు

రోలుగుంట: పరిమితికి మించి టాక్టరుపై భారీ గడ్డి లోడు తరలిస్తుండటంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. గడ్డి తేలికగా ఉండటంతో భారీ పరిమాణంలో లోడు చేసి తరలిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం కొత్తకోట నుంచి నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో వెళ్తున్న గడ్డి ట్రాక్టరు ఇరుక్కుపోయింది. అసలే ఇరుకు రోడ్డు, ఆపై గోతులు, భారీ లోడు కావడంతో రోలుగుంట గ్రామం దాటడానికే అరగంట సమయం పట్టింది. దీని వెనుక, ఎదురుగా వచ్చే వాహనాలకు ఏ విధమైన మార్గం లేకపోవడంతో వాహనచోదకులు నానా ఇక్కట్లు పడ్డారు. ఇటీవల ఈ రోడ్డులో శిథిల మదుములు తొలగించేందుకు గోతులు తీశారు. ఈ విధమైన భారీ లోడు వల్ల ఎక్కడ వాహనాలు అదుపుతప్పి బోల్తా పడి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. ప్రాణాపాయం వాటిల్లకముందే ఇటువంటి వీటిపై సంబంధిత అధికారులు దాడులు చేసి నియంత్రించాలని కోరుతున్నారు.

చల్లంగా చూడమ్మా.. నూకాలమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివారం కావడంతో దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

నర్సీపట్నం: ఐక్యతతోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చునని దళిత సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌సీఎం స్కూల్ ఆవరణలో స్టేట్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్‌భూముల యాజమాన్య హక్కులు, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 20 రకాల స్కీమ్‌లను యథావిధిగా కొనసాగించాలన్నారు. సమస్యల పరిష్కారానికి అందరం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు.

నేడు జగనన్న సురక్ష గ్రామసభలు

నాతవరం: మండలంలో సోమవారం రెండు సచివాలయాల్లో జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. వల్సంపేటలో తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్ నాయుడు, గుమ్మడిగొండలో తన ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో లబ్దిదారులకు 11 రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు.

దేవరాపల్లి: స్థానిక గ్రామ సచివాలయం–1, 2 పరిధిలో సోమవారం జగనన్న సురక్ష క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

కె.కోటపాడు: మండలంలో వి.సంతపాలెం, వారాడ గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీవో కె.శచీదేవి తెలిపా రు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి 11 రకాల ధ్రువపత్రాలను జారీ చేస్తామన్నారు.

లయన్స్ క్లబ్ గవర్నర్‌గా గోపాలరావు

నర్సీపట్నం: లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా డాక్టర్ అధికారి గోపాలరావు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం స్థానిక స్టార్ హోమ్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు విజయకుమార్‌రాజు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ దస్తాల రాఘవేంద్ర రావు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలలో ఉపాధి కోర్సులకు వినతి

అనకాపల్లిటౌన్: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి ఏఎంఏఎల్ కళాశాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలున్న కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని యాజమాన్యాన్ని కోరనున్నట్లు జార్జిక్లబ్ అధ్యక్షుడు బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, రాష్ట్ర విద్యార్థి జేఏసీ నాయకుడు ఆడారి కిషోర్‌కుమార్, మున్సిల్ మాజీ వైస్‌చైర్మన్ విల్లూరి పైడారావులు తెలిపారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సంఘం ఆధ్వర్యంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రతి నెల రెండో శనివారం విద్యార్థులంతా సమావేశం కావాలని కోరారు. దేశ, విదేశాల్లో వివిధ హోదాల్లో ఉన్న సుమారు లక్ష మంది పూర్వ విద్యార్థుల వివరాలు సేకరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో సోలార్ యూనిట్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీహెచ్ రామచంద్ర రావు, కేవీఎస్ నాయుడు, పెనుమత్స కృష్ణంరాజు, వై.జగదీశ్వరరావు, కేఎస్ఎస్ శర్మ, కొణతాల రాజేంద్రప్రసాద్, బీవీ కన్నారావు, పెంటాద్రి రావు, బాలు గాడి, బీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి పనులు ప్రారంభం

- వర్షాలు కుస్తుండటంతో ఎదిగిన ఆకుమడులు
- పొలం దమ్ములు చేస్తున్న రైతులు



లూలూరు పొలాల్లో ఎదిగిన వరి ఆకు మడి



శింగవరం పొలాల్లో నీరు చేరడంతో చేసిన దమ్ములు

బుచ్చెయ్యపేట: మండలంలో ఖరీఫ్ వరి పనులు ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా జోరుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, బావుల్లో నీరు చేరి నదులు, గెడ్డలు ప్రవహిస్తున్నాయి. పల్లపు పొలాల్లో వర్షం నీరు చేరడంతో రైతులు ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, కారుటెద్దులతో దమ్ములు చేస్తున్నారు. జూన్ ఆరంభంలో వేసిన వరి ఆకులు ఏపుగా ఎదిగి నాట్లుకు అందివస్తోంది. మండలంలో ఈ ఏడాది 6,400 ఎకరాల్లో వరినాట్లు వేయడానికి తగిన ఏర్పాట్లు చేశారు. దమ్ములో సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు కలిపి దమ్ము చేసి రెండు, మూడు రోజులు భూమిని పులియబెట్టి వరినాట్లు వేస్తామని రైతులు తెలియజేస్తున్నారు. పులియబెట్టిన భూమిని ఆఖరి సారి పంట దమ్ము చేసి వరి నాట్లు వేస్తే భూమి గుల్లబారి వేగంగా కారుకుంటాయని ఏవో భాస్కరరావు తెలిపారు. పొట్టిదొరపాలెం, గంటికొర్లాం, నిమ్మలోవ, భట్లోవ, శింగవరం, లూలూరు, వడ్డాది, దిబ్బిడి తదితర గ్రామాల్లో రైతులు దమ్ములు చేసి వరినాట్లు వేయడానికి సన్నద్ధమయ్యారు.

చేప బెల్లం ద్రావణంతో మొక్కకు పోషకాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ మండల మాస్టర్ ట్రైనీ దేవి



మీనామృతం తయారు చేయడంపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

రోలుగుంట: చేప బెల్లం ద్రావణం వినియోగంతో ఉద్యాన పంటలకు ఎంతో మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ మండల మాస్టర్ ట్రైనీ పి.దేవి తెలిపారు. శరభవరంలో రైతులకు చేప బెల్లం ద్రావణం తయారీపై ప్రయోగ పూర్వకంగా ఆమె అవగాహన కల్పించారు. 15 కిలోల చేపల వ్యర్థాలు, 15 కిలోల నల్ల బెల్లాన్ని 15 లీటర్ల నీటితో మిశ్రమం చేశారు. దీన్ని 27 రోజుల నిల్వ ఉంచాలని, రోజుకొకసారి కలియ తిప్పాలన్నారు. ఇది ఆరు మాసాలు నిల్వ ఉంటుందన్నారు. ఈ ద్రావణాన్ని పిచికారీ చేయడం వల్ల చీడపీడల నివారణతోపాటు మొక్కకు బలమైన పోషకాలు అందుతాయన్నారు. అంతే కాకుండా పంట ఆశించిన ఫలితాలు రావడంతోపాటు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సాధించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రతినిధులు సాంబమూర్తి, మోదినాయుడు, మంగ జ్యోతి పాల్గొన్నారు.

మీనామృతం తయారీపై శిక్షణ

మాకవరపాలెం: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా రైతులకు మీనామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఆదివారం జంగాపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్య సిబ్బంది సుదర్శన్, వేణమ్మ, సత్యవేణి మీనామృతం తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. దీనిని తయారు చేసేందుకు చేపల పొట్టు, బెల్లం అవసరమన్నారు. వీటిని కలిపిన అనంతరం తయారయ్యే మీనామృతాన్ని పంటలపై పిచికారీ చేయడం ద్వారా చీడపీడలను నివారించవచ్చన్నారు. సిబ్బంది దేవి, ప్రభావతి పాల్గొన్నారు.